

బ్రహ్మచారిణిగా భ్రామరి

- మయూర వాహనంపై విహరించిన స్వామి, అమ్మవార్లు
- శ్రీశైలంలో వైభవంగా దసరా ఉత్సవాలు

శ్రీశైలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం భ్రమరాంబికా అమ్మవారు బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం మయూర వాహనంపై మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి విహరించారు. నవదుర్గా అలంకారాల్లో ఒకటైన బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కుడిచేతిలో జపమాల, ఎడమచేతిలో కమండలాన్ని ధరించిన అమ్మవారిని దర్శించుకోవడంతో శుభఫలితాలు, విజయాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. గ్రామోత్సవంలో భాగంగా మయూర వాహనంపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులనుజేసి సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అశేష భక్తజనం నడుమ కోలాహలంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు పాల్గొన్నారు. గ్రామోత్సవం సాగుతుండగా కళాకారులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాదస్వరం, కేరళచండీ, డమరుకం, చెక్కభజన, తప్పెట, డోలు విన్యాసం తదితర కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు: ఆలయంలోని దక్షిణ మాడవీధిలో ఉన్న నిత్య కళారాధన వేదిక వద్ద సాయంత్రం నంద్యాలకు చెందిన ఎస్.నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రం కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శైవ గీతాలకు చిన్నారులు, కళాకారుల ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

నేడు చంద్రఘంట అలంకరణ: దసరా మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం భ్రమరాంబికా అమ్మవారు చంద్రఘంట అలంకారణలో దర్శనమిస్తారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు రావణవాహనసేవ నిర్వహిస్తారు.



మయూర వాహనంపై స్వామి, అమ్మవార్లు

కుమారి పూజ ప్రత్యేకం : దసరా మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు కుమారి పూజలు జరిపించబడుతున్నాయి. ఈ కుమారి పూజలో రెండు సంవత్సరాల నుంచి పది సంవత్సరాల వయస్సు ఉన్న బాలికలను పూలు, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించి పూజించడం ఆనవాయితీ.



గ్రామోత్సవంలో కళాకారుల విన్యాసం



బ్రహ్మచారిణి అలంకారంలో అమ్మవారు



తప్పెట కొడుతున్న కళాకారులు

రహదారుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్

- రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే రహదారుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేయనున్నట్లు రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి బీసీ సమాధానమిచ్చారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వంతెనలు, రోడ్లపై ఎమ్మెల్యేలు ఆందోళన చెందుతున్న అంశం వాస్తవమే అన్నారు. గత టీడీపీ హయాంలో వేసిన రోడ్లు తప్ప కొత్తగా వైసీపీ హయాంలో ఆర్‌అండ్‌బీ రోడ్లను గత ప్రభుత్వం అభివృద్ధి చేయలేదన్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.1,080కోట్లు ఖర్చు పెట్టి గుంతలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దామన్నారు. వర్షాకాలం పూర్తయిన తర్వాత మిగిలిన రహదారుల అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 352 వంతెనల పునర్నిర్మాణం కోసం రూ.1,430 కోట్లు అవసరమన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ సునీల్ షెరాన్



డీఐజీకి పూలమొక్కను అందజేస్తున్న ఎస్పీ

నంద్యాల టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రజలకు ఎస్పీ సునీల్‌షెరాన్ మంగళవారం సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఇటీవల డిజిటల్ అరెస్ట్ అనే పేరుతో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసులు, సీబీఐ అధికారులంటూ కాల్స్ చేస్తూ కేసులు నమోదు పేరుతో బెదిరిస్తున్నారన్నారు. అలాంటి వాటిని నమ్మవద్దని సూచించారు.

డీఐజీని కలిసిన ఎస్పీ : కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్‌ను ఎస్పీ సునీల్‌షెరాన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలు, నేర నియంత్రణ తదితర అంశాలపై చర్చించారు.

సూపర్ జీఎస్టీ



- జీఎస్టీ తగ్గింపుతో పెరిగిన విక్రయాలు
- పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట
- ఎలక్ట్రానిక్ వస్తువుల నుంచి కార్ల వరకు
- నిత్యావసర సరుకుల్లోనూ భారీగా తగ్గింపు
- జీఎస్టీకి తోడు దసరా ఆఫర్లు

ప్రజలపై పన్నుల భారం తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో తీసుకొచ్చిన సమూల మార్పులు అమల్లోకి వచ్చాయి. నిత్యావసర వస్తువులపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి, ద్విచక్ర వాహనాలు, చిన్నకార్లు, టీవీలు, ఏసీలు, సిమెంట్ తదితర వాటిపై 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది. రైతుల కోసం ఎరువులు, పురుగుమందులు, ట్రాక్టర్లపై 12 శాతం నుంచి 5 శాతానికి కుదించింది. ఈ క్రమంలో జీఎస్టీ తగ్గింపుతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో వస్తువుల కొనుగోళ్ల శాతం గణనీయంగా పెరిగింది. అంతే కాకుండా నిర్మాణ రంగం సైతం ఊపందుకుంటోంది. వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లు సైతం అమాతంగా పెరిగాయి. జీఎస్టీ తగ్గింపునకు తోడు దసరా ఆఫర్లు రావడంతో మధ్యతరగతి ప్రజలు కావాల్సిన వస్తువులను తమకు వచ్చిన బడ్జెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెద్ద షోరూంల నుంచి చిన్నపాటి దుకాణం వరకు వినియోగదారులతో రద్దీగా కనిపిస్తున్నాయి.



షోరూంలో కొనుగోలుదారులు



నంద్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపును అమలు చేయడంతో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా పలు షోరూంలు, రిలయన్స్, సత్యా, మోర్ తదితర బడా మాల్స్‌లో సైతం జీఎస్టీ తగ్గించి వ్యాపారా లావాదేవీలు చేశారు. దీంతో వినియోగదారులు సైతం పెద్దఎత్తున తరలి వచ్చి తమకు అవసరమైన వస్తువులు, వాహనాలను సైతం కొనుగోలు చేస్తున్నారు. ప్రధానంగా కార్లు, ఏసీలు, వాషింగ్ మిషన్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు సైతం అధికంగానే కొనుగోలు చేస్తున్నారు. జీఎస్టీ తగ్గింపుతో ఎలక్ట్రానిక్ వస్తువుల నుంచి కార్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాల వరకు సుమారు 375 వస్తువుల వరకు జీఎస్టీ తగ్గింపు వర్తింపచేసింది. ఇదే క్రమంలో ఇంటి నిర్మాణ రంగానికి వినియోగించే సిమెంట్‌పై జీఎస్టీ 28శాతం నుంచి 18శాతం తగ్గించారు. జీఎస్టీ తగ్గుదల ఉంటుందని నెల రోజుల ముందుగానే కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయడంతో వినియోగదారులు తమకు కావాల్సిన వస్తువుల కోసం వేచి చూశారు. జీఎస్టీ తగ్గుదలతో పాటు దసరా పండుగ ఆఫర్లు రావడంతో వినియోగదారులు తమకు నచ్చిన వస్తువులను బడ్జెట్‌లో కొనుగోలు చేస్తున్నారు.

మిగతా 7వ పేజీలో

తగ్గిన బైక్‌ల ధరలు వివరాలు			
వాహనం పేరు	పాత ధర	కొత్త ధర	ఆదా
హోండా యాక్టివా	84,173	77,238	6,935
యూనికార్న్	1,19,327	1,09,500	9,827
షైన్	87,189	80,100	8,000
సీటీ (100సీసీ)	70,000	62,000	8,000
పల్సర్ (125సీసీ)	86,000	80,000	6,000
పల్సర్ (150సీసీ)	1,12,000	1,03,000	9,000
● కార్ల ధరలు ఇలా...			
బొలెరో	10,92,600	9,78,000	1,14,300
స్కార్పియో	23,44,001	22,11,701	1,32,300
థార్ రాక్స్ ఎక్స్‌యూవీ3	23,38,799	22,05,999	1,33,000
ఏఎక్స్‌ఎల్	15,79,501	14,39,800	1,39,701
సెల్టోస్(పెట్రోల్)	11,18,900	10,79,275	36,625
సోనట్	7,79,900	7,30,137	49,763

బడ్జెట్‌ను నాశనం చేసింది వైసీపీనే

- రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్



అధ్యక్షా...

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మైనార్టీలు, బీసీలకు బడ్జెట్ లేకుండా చేసింది, బడ్జెట్‌ను నాశనం చేసింది వైసీపీనే అంటూ రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ శాసనసభలో వైసీపీకి చురకలు అంటించారు. మంగళవారం జరిగిన శాసనమండలి సమావేశంలో వైసీపీ ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మైనార్టీలకు సంబంధించి కూటమి ప్రభుత్వం హామీలను అమలుపరచడంలేదని, మైనార్టీ, వక్ఫ్‌బోర్డు, ఉర్దూ అకాడమి తదితర అంశాలకు సంబంధించి ప్రశ్నలు లేవనెత్తారు. వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఫరూక్ సమాధానమిస్తూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది తెలుగుదేశం ప్రభుత్వం అని గుర్తుచేశారు. మైనార్టీలకు బడ్జెట్‌లో ఏమైనా కేటాయించారా అని ప్రశ్నించారు. మౌజన్‌లకు గౌరవవేతనాలు ప్రవేశపెట్టిందే చంద్రబాబునాయుడు అని అంటూ వైసీపీ ఎమ్మెల్సీలపై మంత్రి విరుచుకుపడ్డారు. 2014-19లో 86,332మందికి రుణసాయం అందించామన్నారు. వైసీపీ హయాంలో మైనార్టీ లబ్దిదారులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. వక్ఫ్‌బోర్డు స్ట్రీమ్‌లైన్ చేసిందే టీడీపీ అని, ప్రస్తుత ఏడాదిలో 86వేలకుపైగా దరఖాస్తులు రుణాల కోసం వచ్చాయని, 19,790మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించామని అన్నారు.

ఇద్దరు విద్యుత్ ఏఈలు సస్పెన్షన్?

బనగానపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె విద్యుత్ అర్బన్ ఏఈ శ్రీనివాసులు, రూరల్ ఏఈ గర్జప్పను ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ సస్పెండ్ చేసినట్లు మంగళవారం ఉన్నతాధికారుల ద్వారా తెలిసింది. జలసిరి పథకానికి సంబంధించిన విద్యుత్ మెటీరియల్ విజిలెన్స్ అధికారుల తనిఖీలో కనిపించకపోవడంతో వీరిని సస్పెండ్ చేసినట్లు తెలిసింది. జలసిరి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించిన మెటీరియల్ వివరాలు సక్రమంగా తెలపకపోవడంతో వారిని సస్పెండ్ చేసినట్లు సమాచారం. అయితే మెటీరియల్‌ను రైతులకు అప్పగించినట్లు ఏఈలు ఉన్నతాధికారులకు వివరించడంతో సస్పెన్షన్‌ను తొలగించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

జనన సర్టిఫికెట్లు వెంటనే జారీచేయండి

- కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి గనియా

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో జన్మించే ప్రతి నవజాత శిశువుకు వెంటనే జనన సర్టిఫికెట్లు జారీచేయాలని కలెక్టర్ రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం, జనన-మరణ నమోదు కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో శిశువు జననం జరిగిన వెంటనే ఆస్పత్రి ద్వారానే రిజిస్ట్రేషన్ పూర్తవ్వాలని, తల్లిదండ్రులు ధ్రువపత్రం కోసం తిరగాల్సిన అవసరంలేకుండా వెంటనే సర్టిఫికెట్ అందజేయాలన్నారు. శిశువు జననానికి సంబంధించి ప్రత్యేకంగా సిబ్బందిని పెట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఒక సంవత్సరం లోపు అయితే ఉచితంగా నమోదు చేస్తారని, సంవత్సరం దాటితే ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లించి నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. డూప్లికేట్ జననాలు నమోదవకుండా చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, డా.శారదాబాయి, మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారి లీలావతి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, ట్రైబల్ వెల్ఫేర్, ఇంటర్ విద్య, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీహైదర్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో 10గేట్లతో నీటి విడుదల

- నీటి నిల్వ సామర్థ్యం 203 టీఎంసీలు



10 గేట్లతో కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రిజర్వాయర్‌కు ఎగువ జూరాల స్పిల్‌వే, సుంకేసుల, హంద్రీ నుంచి డ్యాంకు 3.58లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరాయి. శ్రీశైలం పది గేట్ల ద్వారా సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. వరద వేగం పుంజుకోవడంతో గేట్ల ఎత్తును 14 అడుగులకు ఇంజనీర్లు పెంచారు. రెండు విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి అనంతరం 65,482 క్యూసెక్కులు విడుదల చేశారు. గడిచిన ఇరవై నాలుగు గంటల్లో 31.869 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు జెన్‌కో అధికారులు అనుసంధానం చేశారు. మంగళవారం సాయంత్రం నీటినిల్వ సామర్థ్యం 203 టీఎంసీలుగా ఉంది.

కన్నీటి ఉల్లి

ఉల్లి పంట రైతులకు కన్నీరు పెట్టిస్తోంది. మూడు నెలల పాటు ఉల్లి పంటను పండిస్తే ధరలేక రైతన్నలు కుప్పకూలిపోయే పరిస్థితి. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్నవంగలిలో రామసుబ్బారెడ్డి అనే రైతు రెండెకరాల్లో ఉల్లిని సాగు చేశాడు. ధర లేకపోవడంతో మంగళవారం పొలంలోనే కుప్పలుగా పోసిన ఉల్లి గడ్డలను వదిలేశాడు. విషయం తెలుసుకున్న ప్రజలు పొలం వద్దకు వెళ్లి సంచుల్లో ఉల్లిగడ్డలను నింపుకొని వారి వారి గృహాలకు తీసుకెళ్లారు. కేజీ ధర రూ.2 పలకడంతో ఉల్లిగడ్డలు కోసిన కూలీలు రూ.15వేలు అవుతుండటంతో పంటను వదిలేశానని రైతు ఆవేదన వెలిబుచ్చాడు. రెండెకరాల్లో పెట్టుబడి రూ.లక్ష దాక ఖర్చు చేశానని, తీరా పంట చేతికొచ్చాక ధర లేక నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ పంట సాగు చేసుకునేందుకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరాడు.





చిన్నవంగలిలో ఉల్లిగడ్డలను సంచులకు వేసుకుంటున్న మహిళలు

● చాగలమర్రి, ఆంధ్రజ్యోతి

కోనసీమ అందాలు

● కనువిందు చేస్తున్న పచ్చటి పొలాలు
● కొండను కప్పేసిన మంచు తెరలు

చాగలమర్రి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు, చింతలచెరువు భైరవగుండాల సమీపంలో కురిసిన వర్షాలతో కమ్ముకున్న మబ్బులు, మంచు తెరలను చూపరులను కనువిందు చేశాయి. శెట్టివీడు గ్రామ సమీపంలో కోనసీమను తలపించేలా పచ్చని పంట పొలాలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి.



శెట్టివీడు గ్రామ సమీపంలో కనువిందు చేస్తున్న పచ్చని పొలాలు



భైరవగుండాల సమీపంలో కొండలపై మంచు తెరల్లా మేఘాలు

సామర్థ్యం పెంచేందుకు ప్రతిపాదనలు

● తెలుగుగంగ ఈఈ మురళీకృష్ణ



తెలుగుగంగ కాలువను పరిశీలిస్తున్న ఈఈ మురళీకృష్ణ

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ లో తెలుగుగంగ ప్రధాన కాలువ సామర్థ్యం పెంచేందుకు ప్రభుత్వం ఆదేశించిందని ఇందుకు సబంధించి ప్రతిపాదనలు పంపినట్లు తెలుగు గంగ ఈఈ మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం ఆళ్లగడ్డ సబ్‌డివిజన్‌లో తెలుగుగంగ ప్రధాన కాలువను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.204 కోట్లతో తెలుగుగంగ ప్రధాన కాలువ మరమ్మతులకు నివేదికలు పంపినట్లు చెప్పారు. 10కిలో మీటర్ నుండి 96.13 కిలోమీటర్ వరకు పెండింగ్ ఉన్న పనులు పూర్తి చేసి కాలువలో నీటి సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తెలుగు గంగ ప్రాధన కాలువ వెంట తిరిగి చేశామని అక్కడక్కడ గేట్లు, బండ్ల వెడల్పు లైనింగ్ రివిట్‌మెంట్ పనులు చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన వెంటనే పనులు పూర్తి చేసి రైతులకు నీటి కొరత లేకుండా చూస్తామని ఆయన వివరించారు.

విద్యార్థులు పథకాలను తెలుసుకోవాలి

● క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రభుత్వ పథకాలను తెలుసుకొని, కుటుంబసభ్యులకు వివరించాలని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం క్లస్టర్ యూనివర్సిటీలో వికసిత్ భారత్ సేవా సర్వ్ 2025 వర్క్‌షాపును తెలుగు శాఖ అధ్యాపకురాలు ఫమీదాబేగం ఆధ్వర్యంలో నిర్వహించారు. పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం ప్రతిష్టాత్మకమైన మంచి పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. వీటి గురించి చాలామంది గ్రామీణ ప్రాంత ప్రజలకు, చదువు రానివారికి విద్యార్థులు తెలియజేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బీఆర్ ప్రసాదరెడ్డి, డీన్ నాగరాజశెట్టి, వాహిజ్, అధ్యాపకులు ఎల్లాకృష్ణ, నాగ్ అరుణ్, డి.మల్లయ్య పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ప్రిన్సిపాల్

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో మాద్రక ద్రవ్యాల సంబంధిత నేరాలపై అవగాహన సదస్సు జరిగింది. ఎస్ఐ సృజనకుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఫకృన్నీసా, అధ్యాపకులు వింధ్యావాసిని దేవి, మాదన్న, సుజాతా, షాజీదా పాల్గొన్నారు.

అరటి ధర పతనం

● టన్ను రూ.4 వేలకు పడిపోయిన రేటు
● ఆందోళనలో అన్నదాతలు



అరటిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించే అన్నదాతకు అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయి. ఎన్నో కష్టానష్టాలకు ఎదురొడ్డి పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఉల్లి, టమోటా, చీనీ ధరలు పతనమై తీవ్ర నష్టాలతో కుదేలవుతున్న అన్నదాతలకు తాజాగా అరటి ధరలు కూడా ఆకోవలోకే చేరుకోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. గత నెల, రెండు నెలల క్రితం ఆశాజనకంగానే ఉన్న అరటి ధరలు ప్రస్తుతం రోజురోజుకూ పతనం అవుతుండడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అరటి టన్ను రూ.22 వేల నుంచి రూ.24వేల వరకు పలికింది. దీంతో అన్నదాతల ఆశలు చిగురించాయి. గత నెలన్నర క్రితం శ్రావణ మాసంలో కూడా అరటి ధరలు అదరహో.. అనిపించాయి. టన్ను రూ.18 వేల నుంచి రూ.20వేల వరకూ పలికాయి. అయితే కొన్నిరోజులుగా మార్కెట్లో అరటి ధరలు అధఃపాతాళానికి పడిపోయాయి. ప్రస్తుతం అరటి ధర రూ.4వేలు, రూ.5వేలు మించి పలకకపోవడంతో అన్నదాతలు కుదేలవుతున్నారు. సిరులు కురిపిస్తుందనుకున్న అరటి నష్టాలను మిగులుస్తోందని రైతన్నలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 10వేల ఎకరాలకు పైగా రైతులు అరటి సాగు చేసినట్లు ఉద్యానవన శాఖ అధికారుల లెక్కల ద్వారా తెలుస్తోంది. ఒక్కసారిగా అరటి ధరలు పడిపోవడంతో అన్నదాతలు దుక్కుతోచని స్థితిలో పడిపోయారు. అరటి సాగు కోసం ఎకరాకు రూ.1లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెడితే, 10, 12 టన్నుల లోపే దిగుబడి వచ్చిందని, ప్రస్తుత ధరలతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవని అరటి రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం అరటి రైతులకు చేయూతనందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లో అధిక దిగుబడే ధరల పతనానికి కారణమా?

ప్రస్తుత సమయంలో మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున అరటి దిగుబడి పెరగడమే అరటి ధరల పతనానికి ప్రధాన కారణమని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పండే అరటి అత్యధికంగా ఢిల్లీ, ఇరాన్, ఇరాక్ దేశాలకు సైతం ఎగుమతి అవుతోంది. అయితే ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున అరటి దిగుబడి మార్కెట్లోకి రావడంతో, మన ఎగుమతులు తగ్గి, రోజు రోజుకూ ధర క్షీణిస్తోందన్న చర్చ సాగుతోంది.





గ్రేడింగ్ అనంతరం లోడింగ్ చేస్తున్న వ్యాపారులు

సీఎంను కలిసిన రమేష్‌నాయుడు



ముఖ్యమంత్రిని కలిసిన చైర్మన్ రమేష్‌నాయుడు

శ్రీశైలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును శ్రీశైలం దేవస్థాన బోర్డు చైర్మన్ పోతుగంట రమేష్‌నాయుడు కలిశారు. మంగళవారం అమరావతిలోని సీఎం కార్యాలయంలో ఆయన సీఎంను కలిసి శ్రీశైలం దేవస్థాన బోర్డు చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్వామివారి శేష వస్త్రమును, లడ్డూ ప్రసాదాన్ని రమేష్‌నాయుడు సీఎంకు అందజేశారు.

పైప్ లైన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

● ఉక్కు పరిశ్రమను పరిశీలించిన కలెక్టర్ సిరి



గుట్టపాడు వద్ద జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమను పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి

ఓర్వకల్లు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు నీటి సరఫరా పైప్ లైన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ సిరి అధికారులను ఆదేశించారు. గుట్టపాడు సమీపంలో ఏర్పాటు చేసిన జైరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్‌ను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ఉక్కు పరిశ్రమలో కలియ తిరిగి స్టీల్ ప్లాంట్ వివరాలను యాజమాన్యం, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల చెక్ పోస్ట్ వద్ద నిర్మిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ఉద్యానవనం పార్కును అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అనంతరం జైరాజ్ ఇస్పాత్ లిమిటెడ్‌ను పరిశీలించారు. అంతకు ముందు డ్రోన్ హబ్‌కు కేటాయించిన 300 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాసన మండలిలో ప్యానల్ స్పీకర్‌గా బీటీ నాయుడు



కోసిగి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో కోసిగి మండలం జుమ్మాలదిన్నె గ్రామానికి చెందిన సాధారణ రైతు కుటుంబానికి చెందిన బీటీ నాయుడిని ఏపీ శాసన మండలిలో ప్యానల్ స్పీకర్‌గా ఎంపిక చేశారు. దీంతో జుమ్మాలదిన్నె గ్రామస్థులు, కోసిగి మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రీవిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు మంగళవారం శాసన మండలిలో ప్యానల్ స్పీకర్‌గా వ్యవహరించి స్పీకర్ కుర్చీ నుంచి సభ కార్యక్రమాలను నడిపించారు. సభలో జరిగే చర్చలను శాంతంగా వినిపిస్తూ సభ్యుల అభిప్రాయాలకు సమాన అవకాశాలు ఇస్తూ అధికార, ప్రతిపక్ష సభ్యుల చర్చలు సజావుగా కొనసాగేలా చూశారు.

ప్రహ్లాద వరద స్వామికి తిరుమంజనం



తిరుమంజనం నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల్ స్వామి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మంగళవారం దసరా ఉత్సవాల అంకురార్పణను వైభవంగా ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులు ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు వేదపండితులు నవకలశాలను ప్రతిష్టించి తిరుమంజనం నిర్వహించారు. ఆలయ కోనేరులోని పవిత్ర జలాలు, సుగంధ ద్రవ్యాతో అభిషేకం చేశారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబరు 29వ తేదీ నుంచి అక్టోబరు 7వ తేదీ వరకు పొడిగించారన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. మరిన్ని వివరాలకు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

వివిధ రూపాల్లో అమ్మవారు



మహానందిలో బ్రహ్మచారిణి దుర్గ అలంకారంలో అమ్మవారు

బ్రహ్మచారిణిగా కామేశ్వరీమాత

మహానంది: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహానంది క్షేత్రంలో కామేశ్వరీదేవి అమ్మవారు బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. యాగశాల మండపంలో ఉభయ దాతల చేత చండీహోమంతో పాటు కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ నిర్వహించారు. ఇదిలా ఉండగా భారీ వర్షం నేపథ్యంలో దుర్గామాత అలంకరణలో జరగాల్సిన అమ్మవారి గ్రామోత్సవాన్ని రద్దు చేశారు. మూడోరోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనమిస్తారు.

కర్నూలు కల్చరల్/ మంత్రాలయం/ గూడూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం వివిధ ఆలయాలతో పాటు మండపాల్లో కొలువుదీరిన అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు బ్రహ్మణచారిణి (గాయత్రి మాత) రూపంలో భక్తులు పూజించారు. కర్నూలు నగరంలోని పూలబజార్‌లో చిన్న అమ్మవారిశాలలో అమ్మవారికి పరాశక్తి అలంకరణ, వన్‌టౌన్‌లోని గీతామందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శ్రీకాల స్వరూపిణిగా, కల్లూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి మాత గౌరీదేవిగా దర్శనమిచ్చారు. కర్నూలు శివారు మామిదాలపాడులోని గోదా గోకుల క్షేత్రంలో అమ్మవారికి ధాన్యలక్ష్మీ అలంకరణ చేశారు. మహిళా భక్తులతో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. మంత్రాలయంలోని శ్రీమఠంలో కొలువైన మంచాలమ్మ దేవికి గాజులతో అలంకరించారు. గూడూరు మండల కేంద్రంలో వెలసిన సుంకులాపరమేశ్వరి అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



కర్నూలు నిమిషాంబా దేవాలయంలో



కె నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తున్న దృశ్యం



మంత్రాలయం: విశేషంగా గాజులు, పుష్పాలతో మంచాలమ్మ దేవతను అలంకరించిన దృశ్యం



బ్రహ్మచారిణి అలంకరణలో చౌడేశ్వరీ మాత

బనగానపల్లె: నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరీమాత బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్ రెడ్డి, పీవీ నాగార్జునరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సూపర్ జీఎస్టీ

(5వ పేజీ తరువాయి)

రోజూ వారీ వినియోగంలో ఉండే సబ్బులు, ఫేస్ పౌడర్లు, చర్మసౌందర్య వస్తువులు, షాంపూలు, టూత్ పేస్టులు, బ్రష్‌లపై కూడా జీఎస్టీ తగ్గింపు లభించింది. ఈ లెక్కన ప్రతి నెల పేద, మధ్య తరగతి ప్రజలకు నెలకు సుమారు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు ఆదా అయినట్టే.



జీఎస్టీ తగ్గించడంతో కొనుగోలు చేశా

కేంద్ర ప్రభుత్వం టీవీలపై జీఎస్టీ తగ్గించడంతోనే 55 ఇంచెస్ ఎల్ఈడీ టీవీని కొనుగోలు చేశాను. ప్రస్తుతం రూ.58 వేలు పెట్టి కొన్నాను. గతంలో ఇదే టీవీ రూ.66 వేలు ఉంది. ఎప్పటి నుంచో ఇలాంటి టీవీ కొనాలని అనుకున్నాను. కేంద్రం జీఎస్టీ తగ్గించడంతో పేద వర్గాలకు ఎంతో ఉపయోగకరం. **- సత్య, నంద్యాల**

బొలెరో వాహనంపై రూ.95 వేలు తగ్గింది



వ్యక్తిగత పనుల నిమిత్తం ఓ బొలెరో వాహనం కొనాలని కొన్ని రోజుల కిందట నంద్యాల పట్టణంలోని ఓ షోరూం వద్దకు వెళ్లాను. ఆసమయంలోనే కేంద్రం ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుపై ప్రకటన చేసింది. 22వ తేదీ అమలు చేస్తారని ప్రకటించడంతో అప్పటి నుంచి ఎదురుచూశా. అప్పుడు బొలెరో మ్యాక్స్ హెచ్‌డీ రూ.11.45 లక్షలు ఉండగా.. జీఎస్టీ తగ్గింపుతో రూ.10.50 లక్షలకు వచ్చింది. రూ.95 వేలు తగ్గడం ఎంతో సంతోషంగా ఉంది. **- కరుణాకర్‌గౌడ్, నంద్యాల**



నిత్యావసర సరుకులపై తగ్గింపు పేదలకు ఊరట

కొన్నింటిపై 12 నుంచి 5శాతం జీఎస్టీ తగ్గించడంతో పేదలకు వరం లాంటిది. ప్రధానంగా నిత్యావసర సరకులపై కూడా తగ్గించడంతో ఎంతో పేద ప్రజలకు ఉపయోగపడుతుంది. సోప్స్ టూత్‌పేస్టులు, బ్రష్‌లు, స్నాక్స్ పౌడర్స్, నెయ్యి, డ్రైఫ్రూట్స్, గ్రాసరీ తదితర వస్తువులపై గతంలో 12శాతం ఉండేది. విద్యార్థుల వస్తువులపై తగ్గించడంతో మంచిది. నా కుటుంబానికి నెలకు అయ్యే ఖర్చులో.. సుమారు రూ.1,500 తగ్గుతుంది. **- సుబ్బరాయుడు, నంద్యాల**

ఏసీపై రూ.4వేలు తగ్గింది



జీఎస్టీ తగ్గింపుతో రూ.45,990 పెట్టి రిలయన్స్‌లో కొనుగోలు చేశాను. గతంలో రూ.49,990 ఉండగా.. జీఎస్టీ తగ్గింపుతో రూ.4వేలు తగ్గింది. గతంలో వెనక్కి వెళ్లాను. మధతరగతి వాళ్లు కూడా ఏసీలు కొనుగోలు చేయొచ్చు. **- ఫరూక్, వెంకటేశ్వరపురం**



బైకుపై రూ.8వేలు తగ్గింది

రెండు నెలల క్రితం 120 సీసీ హోండా షైన్ వాహనం కొనుగోలు చేద్దామని షోరూమ్‌కు వచ్చా. రూ.1,12,000 ఉండటంతో కొనలేదు. జీఎస్టీ తగ్గింపుతో రూ.1,04,000 పెట్టి కొనుగోలు చేశా. రూ.8వేలు తగ్గింది. నాతో పాటు చాలామంది వాహనాలను కొనుగోలు చేశారు. **-షేక్ జాఫర్, సాయిబాబానగర్, నంద్యాల**

ట్రాక్టర్‌పై రూ.35 వేలు తగ్గింది



జీఎస్టీ తగ్గింపుతో 480 మోడల్ ట్రాక్టర్ రూ.28 లక్షలు ఉండగా.. రూ.35 వేలు తగ్గించారు. కేంద్రం జీఎస్టీ తగ్గించడంతో రైతులకు ఉపయోగం. ఒక్కసారిగా రూ.35 వేలు తగ్గడం సంతోషంగా ఉంది.
- జల్లి నరసింహులు, శ్రీ రంగాపురం

గోపవరంలో బంగారం చోరీ

- పరిశీలించిన ఏఎస్పీ మందా జావళి

మహానంది, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపవరంలో మంగళవారం చోరీ జరిగింది. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన కాకుల లక్ష్మీదేవి శనివారం డోన్‌లో నివాసం ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లారు. తిరిగి మంగళవారం ఇంటికి చేరుకుని పరిశీలించగా ఆమె ఇంట్లోని బీరువాను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి ఉండటం గమనించింది. దొంగలు బీరువాలోని రెండు తులాల బంగారు నగలతో పాటు జత కమ్మలను దోచుకున్నట్లు గుర్తించింది. ఈ విషయాన్ని మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డికి తెలిపారు. సంఘటన స్థలాన్ని నంద్యాల ఏఎస్పీ మందా జావళి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహానంది పోలీసులు వివరించారు.

బస్టాండులో చోరీ

నంద్యాల టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో మంగళవారం చోరీ జరిగింది. వన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల బస్టాండు నుంచి వెలుగోడుకు నాగమణి కూతురుతో వెళ్తుండగా బస్సు ఎక్కె సమయంలో 10 తులాల బంగారు చోరీకి గురైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు బస్సు ఎక్కి దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



బోయ రంగడు(ఫైల్)

డోన్ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన రైతు బోయ రంగడు(60) చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. బోయ రంగడు గత ఆదివారం అప్పుల బాధ తాళలేక తన పొలంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. బంధువులు కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మూడు సంవత్సరాల నుంచి తనకున్న నాలుగెకరాల పొలంలో సాగు చేసిన పంటలు చేతికిరాక అప్పులు అధికమయ్యాయి. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యాయ త్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఏడాది రెండోకరాల్లో వేసిన ఉల్లిగడ్డలు తీవ్ర నష్టాలు మిగిల్చాయి. భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరివరం గ్రామంలో కుక్కల దాడికి మంగళవారం ఉదయం ఓ జింక మృతి చెందింది. స్థానికులు గుర్తించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వీఆర్వో గోపాల్ నాయుడు వెంటనే స్పందించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. బనగానపల్లె ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జయమ్మ సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతి చెందిన జింకకు పోస్టుమార్టం నిర్వహించి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్యేలు తదితరులు పాల్గొన్నారు.

పొలం అమ్ముతామని చెప్పి మోసం

- ముగ్గురిపై కేసు నమోదు

మంత్రాలయం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుదేవ కుంటకి చెందిన కొందరు వ్యక్తులు పొలం అమ్ముతామని మోసం చేశారని రచ్చుమర్రికి చెందిన లీలావతి మంగళవారం ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమణ తెలిపారు. వివరాలు.. కల్లుదేవకుంట గ్రామంలోని సర్వేనెం. 321లోని 1.40ఎకరాల భూమిని అమ్ముతామని 2023 ఆగస్టు 4న రూ.1.26కోట్లకు కురువ సోమశేఖర్, ధర్మతేజ, శాంతమ్మ అనే వ్యక్తులు ఒప్పందం కుదర్చుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.10లక్షలు, మరోసారి రూ.51.27 లక్షలు చెల్లించామని బాధితురాలు లీలావతి చెల్లించారు. ఆమె భర్త చిన్నారెడ్డి ఏప్రిల్ 3న అనారోగ్యంతో మృతిచెందాడు. మిగతా డబ్బులు చెల్లించి పొలం రిజిస్ట్రేషన్ చేయించుకుంటానని ఆమె వారిని అడిగింది. దీనికి వారు నిరాకరించడంతో పెద్దల పంచాయితీతో రూ.1,49,50,000కు పరిష్కారంచేసి మిగిలిన నగదు 2025 ఏప్రిల్ 20న రూ.68లక్షలు చెలించాలని తీర్మానించారు. మిగతా నగదు ఇచ్చి రిజిస్ట్రేషన్‌కు రమ్మని కోరగా వారు రాకుండా ఉన్నారని ఆరోపించారు. ఈ భూమిని కల్లుదేవకుంట సొసైటీలో మార్ట్‌గేజి చేసిన విషయం చెప్పకుండా పొలం అమ్ముతామని తమ దగ్గర రూ.81.50లక్షలు తీసుకొని మోసం చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

బోగస్ ఉత్తర్వులతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం..!



ఉత్తర్వులు అందజేస్తున్న కృష్ణమూర్తి అలియాస్ త్రిమూర్తిరావు

- ప్రభుత్వ పాఠశాలలో నెల రోజులు విధులు
- జీతం అడగడంతో వెలుగులోకి వచ్చిన బాగోతం
- జిల్లాలో 30 మందికి ఉద్యోగాల పేరిట మోసం
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన డీఈవో శామ్యూల్ పాల్

కర్నూలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగాల పేరిట వల వేశారు. నకిలీ సీల్, ఫోర్జరీ సంతకాలతో బోగస్ ఉత్తర్వులు సృష్టించారు. దర్జాగా ప్రభుత్వ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని సైతం నమ్మించారు. అవుట్ సోర్సింగ్ సోషల్ టీచర్‌గా విధుల్లో చేర్పించారు. ఆ పాఠశాలలో నెల రోజులు విధులు నిర్వర్తించిన ఆమె జీతం కోసం సీఎఫ్ఎంఎస్ ఖాతా నంబరు చెప్పాలని ప్రధానోపాధ్యాయుడిని అగడంతో ఈ భాగోతం వెలుగులోకి వచ్చింది. బోగస్ ఉత్తర్వులు సృష్టించి మోసాలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై మంగళవారం కర్నూలు డీఈవో శామ్యూల్‌పాల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు.

కర్నూలు నగరానికి చెందిన కృష్ణమూర్తి అలియాస్ ఎం.త్రిమూర్తిరావు అనే వ్యక్తి రాష్ట్ర సచివాలయంలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నట్లు నిరుద్యోగులను నమ్మించాడు. అంతేకాదు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో), పాఠశాల ప్రధానోపాధ్యాయులను సైతం బోల్తా కొట్టించాడు. కర్నూలు నగరం నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన పీఆర్ పింకి అనే మహిళ గుంటూరులో స్థిరపడ్డారు. ఆమెకు జోహరాపురం ఇందిరమ్మ కాలనీలో నగరపాలక ప్రాథమిక పాఠశాలలో (కల్లూరు దర్వాజ) అవుట్ సోర్సింగ్ సోషల్ టీచర్ ఉద్యోగం ఇస్తున్నట్లుగా, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), సమగ్ర శిక్ష ఎక్స్-అఫిషియో ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ నకిలీ సీల్, ఫోర్జరీ సంతకాలతో బోగస్ ఉత్తర్వులు సృష్టించారు. ఆ ఉత్తర్వులపై అర్బన్ ఎంఈఓ సంతకాలు ఉన్నాయి. సమగ్ర శిక్ష అసిస్టెంట్ డైరెక్టరు (ఏడీ)గా చెప్పుకుంటున్న కృష్ణమూర్తి అలియాస్ ఎం.త్రిమూర్తిరావు, మరో ఇద్దరు వ్యక్తులు ఓ కారులో పీఆర్ పింకితో కలసి జోహరాపురంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్‌తో కృష్ణమూర్తి ఎస్ఎస్ఏ ఏడీగా పరిచయం చేసుకుని అవుట్ సోర్సింగ్ సోషల్ టీచర్‌గా పీఆర్ పింకిని విధుల్లో చేర్పించారు. ఇంతదాక సవ్యంగా సాగిపోయింది. విధుల్లో చేరిన బోగస్ టీచర్ పింకి నెల రోజుల పాఠశాలలో విధులు నిర్వర్తించింది. ఆ తరువాత జీతం కోసం సీఎఫ్ఎంఎస్ ఖాతా ఐడీ నంబరు కావాలని హెచ్‌ఎం మల్లేశ్‌ను అగడడంతో అనుమానం వచ్చి డీఈవో శామ్యూల్ పాల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ ఉత్తర్వులు పరిశీలించిన ఆయన అది బోగస్ ఉత్తర్వు అని తేలిపోయింది. తక్షణమే నకిలీ ఉపాధ్యాయురాలు పీఆర్ పింకిని పాఠశాల నుంచి బయటకు పంపించారు. ఈ భాగోతంలో రూ.లక్షలు చేతులు మారినట్లు సమాచారం. ఆ బోగస్ ఉత్తర్వులపై కర్నూలు అర్బన్ ఎంఈఓ సంతకం కూడా ఫోర్జరీ చేశారు. కారులో ఉన్నతాధికారుల పేరుతో దర్జాగా రావడం, ఉత్తర్వులు ఉన్నట్లు పేపర్లు ఉండటంతో బోగస్ టీచర్ పీఆర్ పింకీ జాయినింగ్ ఆర్డర్‌పై సంతకం చేశారని ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్ రాతపూర్వకంగా రాసిచ్చినట్లు డీఈఓ తెలిపారు. ఇలా పింకీ ఒక్కటే కాదు.. ఈ ముఠా దాదాపు 30 మందికిపైగా నిరుద్యోగులను ఉద్యోగాల పేరిట మోసం చేసి రూ.లక్షలు వసులు చేసినట్లు తెలుస్తోంది. సమగ్ర విచారణ చేస్తే ఉద్యోగాల పేరిట సాగించిన మోసాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



బోగస్ ఉత్తర్వులు ఇవే

ఎస్పీకి ఫిర్యాదు చేశాం



నకిలీ సీల్, ఫోర్జరీ సంతకాలతో అవుట్ సోర్సింగ్ సోషల్ టీచర్‌గా పీఆర్ పింకీ అనే మహిళలకు బోగస్ ఉత్తర్వులు ఇవ్వడమే కాకుండా కృష్ణమూర్తి అలియాస్ ఎం.త్రిమూర్తిరావు అనే వ్యక్తి ఎస్ఎస్ఏ ఏడీగా పరిచయం చేసుకొని జోహరాపురం ఇందిరమ్మ కాలనీ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో పీఆర్ పింకీ అనే మహిళను టీచరుగా విధుల్లో చేర్పించాడు. ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్ నా దృష్టికి తీసుకువచ్చారు. అది బోగస్ ఉత్తర్వు అని తేలడంతో పీఆర్ పింకీని పాఠశాల నుంచి బయటకు పంపిచాం. ఎంఈఓ ప్రభావతమ్మ తన సంతకం ఫోర్జరీ చేశారని లిఖితపూర్వకంగా తెలిపారు. నకిలీ సీల్, ఫోర్జరీ సంతకాలతో బోగస్ ఉత్తర్వులు తయారు చేసి మోసానికి పాల్పడడమే కాకుండా సమగ్ర శిక్ష అసిస్టెంట్ డైరెక్టరు (ఏడీ)గా చెప్పుకుంటున్న కృష్ణమూర్తి అలియాస్ ఎం.త్రిమూర్తిరావు, కర్నూలు రెడ్‌క్రాస్‌లో పని చేస్తున్న సుభాష్, నాయుడుపై ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశాను. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంఈఓ ప్రభావతమ్మ, పాఠశాల హెచ్‌ఎం మల్లేశ్‌పై శాఖపరమైన చర్యల కోసం ఆర్జేడీకి సిఫార్సు చేశాం. **- శామ్యూల్‌పాల్, డీఈవో, కర్నూలు**

జిల్లాలో ప్రకృతి వ్యవసాయ బృందం పర్యటన



పంటలను పరిశీలిస్తున్న వీఆర్ఐటీటీఐ బృందం

నంద్యాల హాస్పిటల్/ప్యాపిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన కోసం కర్నాటక రాష్ట్రానికి చెందిన వీఆర్‌టీటీఐ సంస్థ నుంచి నలుగురు సభ్యులు మంగళవారం నంద్యాల జిల్లాలో పర్యటించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్థిరత్వం, స్వయం సమృద్ధి, జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ఈ సంస్థ పనిచేస్తుంది. ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణ, వ్యవసాయ ఆధారిత ప్రోత్సాహక చర్యలు, మార్కెట్ లింకేజీ అందిస్తూ యువత, మహిళలను బలోపేతం చేసి స్థిరమైన ఆదాయంతో జీవనవిధానం సాధించడానికి దోహదపడుతుందని ఏడీపీఎం అబ్దుల్‌సలాం అన్నారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులు అనుసరిస్తున్న పద్ధతులను తెలుసుకున్నారు. ప్యాపిలి మండలం బావిపల్లి, నేరేడుచర్ల యూనిట్లకు చెందిన ఐసీఆర్పీలు సాగు చేస్తున్న ఏటీఎం మోడళ్లను పరిశీలించారు. 1.20 ఎకరాల విస్తీర్ణంలో సాగుచేస్తున్న 18రకాల వైవిధ్య పంటల విధానాలను అధ్యయం చేశారు. జలదుర్గం ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి వెంకటప్ప అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. సభ్యులు రాగిణి, రఘు, సందీప్, శరత్‌తోపాటు రైతుసాధికార సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ జలాలుద్దీన్, ప్రకృతి వ్యవసాయ అదనపు ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్ సలాం, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

వాయిద్య కళాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ అధ్యతన జరిగే తెలుగు కళా సమితి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన సంగీత వాయిద్యకారులను గుర్తించి సత్కరించనున్నట్లు తెలుగు కళా సమితి కార్యదర్శి ఎలమర్తి రమణయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాకారుల సేవలు, ప్రతిభ, గుర్తించి గౌరవించడం ద్వారా మన సంగీత సంప్రదాయాన్ని పెంపొందించుకోవడం ఈ కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. వాయిద్య సంగీతంలో 5 లేదా అంతకంటే ఎక్కువ అనుభవం ఉండాలని సూచించారు. సంగీత రంగంలో కళాకారులు చేసిన ప్రత్యేక కృషిని తెలియజేసే ప్రెస్ క్లిప్పింగులు, ఫొటోలతో తమ వివరాలు తెలియజేస్తూ దరఖాస్తులను అక్టోబరు 10లోగా ఎలమర్తి రమణయ్య, కార్యదర్శి, తెలుగు కళా సమితి 4-23-5, బాలాజీ నగర్, కర్నూలు-6 అనే చిరునామాకు పంపించాలని సూచించారు. తపాలా/పోస్టు ద్వారా పంపించిన దరఖాస్తులను మాత్రమే పరిశీలిస్తామని వివరాలకు ఎలమర్తి రమణయ్య, సెల్ నెం.9490131005కు సంప్రదించాలని సూచించారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఆర్డీవో, ఈవో

మద్దిలేటి నరసింహ స్వామి సేవలో కలెక్టర్

బేతంచెర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం మద్దిలేటి నరసింహ స్వామి, మహలక్ష్మీ అమ్మవారి దేవస్థానాన్ని కలెక్టర్ రాజకుమారి గణియ మంగళవారం దర్శించుకు న్నారు. ఉప కమిషనర్, ఈవో రామాంజనేయులు కలెక్టర్‌కు పూర్ణకుంబంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. డోన్ ఆర్డీవో నరసింహులు, ఈవో రామాంజనేయులు శాలువా కప్పి సత్కరించారు.

జీవితాలతో ఆటోలాడుకుంటున్నారు



ఆటోలో కిక్కిరిసి ప్రయాణిస్తున్న కూలీలు

ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నారు. ఆటో సామర్థ్యం డ్రైవర్‌తో కలిసి ఐదుగురు మాత్రమే. అయితే కొందరు డ్రైవర్లు కెపాసిటీకి ఐదారింతలు మించి ప్రయాణికులను ఎక్కించుకుంటు న్నారు. మంగళవారం అనుగొండ వద్ద కూలీలను తరలిస్తున్న ఆటోలో చిన్నపిల్లలను టాప్‌పైన కూర్చోబెట్టారు. డ్రైవర్ పక్క, వెనుక సీట్లలో మహిళలు కిక్కిరిసి కూర్చున్నారు. ఇలాంటి ప్రయాణం సురక్షితమా? కాదా ? అని కూలీలు, ఆటో డ్రైవర్లు ఆలోచించడం లేదు. దూరాన్ని బట్టి ఒక్కో కూలీ నుంచి రూ.40, రూ. 50 డ్రైవర్లు వసూలు చేస్తున్నారు. ● **కోడుమూరు రూరల్, ఆంధ్రజ్యోతి**

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఎస్‌జీఎఫ్ స్టేట్ అబ్జర్వర్ ప్రభాకర్
- రాష్ట్రస్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం




ఎస్‌జీఎఫ్ జ్యోతికి స్వాగతం పలుకుతున్న నాయకులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ఏ ప్రభుత్వంలో లేని విధంగా కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తుందని ఎస్‌జీఎఫ్ స్టేట్ అబ్జర్వర్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఎమ్మిగనూరులోని జూనియర్ కళాశాల మైదానంలో అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కర్నూలు సెక్రటరీ రాఘవేంద్ర ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారం భమయ్యాయి. మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లయ్య, టీడీపీ నాయకులు బాస్కర్ల చంద్రశేఖర్, మహేష్, మహేంద్ర, డా మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, కౌన్సిలర్ రామదాసు గౌడ్, మాజీ కౌన్సిలర్లు రామకృష్ణ నాయుడు, ముల్లా కలీముల్లా జ్యోతివెలిగించి పోటీలను ప్రారంభించారు. జాతీయజెండాను, స్కూల్‌గేమ్స్ పథాకాన్ని నాయకులు ఎగురవేశారు. కార్యక్రమానికి హాజరైన నాయకులకు, అధికారులకు వివిధజిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు గౌరవవందనం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం క్రీడాకారులకు 3శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. డీఎస్సీ లేకుండా నేరుగా టీచర్ పోస్టులు ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుంద న్నారు. రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీలో పాల్గొనకుండానే నేరుగా 50మందికి టీచర్ పోస్టులు ఇచ్చిందన్నారు. ఎమ్మిగనూరు ఫుట్‌బాల్‌కు పెట్టింది పేరు అన్నారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ క్రీడలకు పుట్టినిల్లు ఎమ్మిగనూరు అని ఎంతో మంది క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారన్నారు. క్రీడాభివృద్ధి కోసం దివంగత నేత బీవీ మోహన్‌రెడ్డి ఎంతో కృషిచేశారన్నారు. కార్యక్రమంలో పీడీలు రామాంజనేయులు, అస్లాం, హనీఫ్, విక్రమ్, శీను, శ్రీరామ్, నరసింహరాజు, రాఘవేంద్ర, టీడీపీ నాయకులు ఉసేన్ పీరా, బందే నవాజ్ కామర్తి మహేష్, రాజేష్, అబ్దుల్లా, దోమా భీమేష్, ఉరుకుంద, జయన్న తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ జిల్లాల క్రీడాకారులు





పీజీఆర్ఎస్ దరఖాస్తులపై ఆర్డీవో విచారణ


విచారిస్తున్న ఆర్డీవో నాగజ్యోతి

నందికొట్కూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్‌లో 1980లో ప్రభుత్వం చేసిన భూ సేకరణలో తమకు కొంత భూమి మిగిలి ఉందని, ఇవ్వాలని పట్టణానికి చెందిన వైజుల్లా పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి పట్టణంలోని బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్‌లోని స్థలాన్ని పరిశీలించారు. అక్కడే ఆర్డీవో కూర్చొని బాధితుడు వైజుల్లా, తహసీలారు, డీఐవోలతో కలిసి చర్చించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి అయ్యిందని నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తామని ఆర్డీవో తెలిపారు. విచారణలో నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు, కమిషనర్ బేబి, ఆత్మకూరు డీఐవో, వీఆర్వోలు పాల్గొన్నారు.

వైభవంగా పాదపద్మారాధన సేవ

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలోని వేంకటేశ్వరస్వామికి మంగళవారం ఉదయం సుప్రభాతసేవ, పంచామృత అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 108 వెండి పుష్పాలతో వెంకటేశ్వరస్వామికి అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతులు ఇచ్చారు.

పీ-4 సర్వేలో అందరూ పాల్గొనాలి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పీ- 4 సర్వేలో సచివాలయ పరిధిలోని సిబ్బంది పాల్గొనాలని ఎంపీడీవో సుగుణశ్రీ ఆదేశించారు. మంగళవారం మండల కార్యాలయంలో పీ- 4 సర్వే నిర్వహణపై మండలస్థాయి సచివాలయ సిబ్బందికి మంగళ, బుధవారాల్లో శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. మొదటిరోజు పశుసంవర్ధక శాఖ, డిజిటల్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు, డబ్ల్యూ ఈ ఏఎస్ శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాములపాడు : ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ భవనంలో పీ-4 కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీడీ అన్వారాబేగం, ఏఎస్‌వో తేజస్విని, ట్రైనర్స్ అబ్దుల్‌సలాం,జిలాని బాషా, గౌస్ పాల్గొన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని జైకిసాన్ పార్కులో మున్సిపల్ మేనేజర్ సుహృలత ఆధ్వర్యంలో పీ-4 సర్వేపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ బేబి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్యాయం జరిగితే ఊరుకోం

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

మిడుతూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సైపాలెం గ్రామస్థులకు అన్యాయం జరిగితే ఊరుకోమని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం గ్రామంలో రైతుల భూములను, రస్తాలను, సోలార్ పనులను సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు, పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో రైతుల, ప్రజల ఆమోదం లేకుండా రెవెన్యూ అధికారులు, గ్రీన్‌కో యాజమాన్యం దౌర్జన్యంగా భూములు ఆక్రమిస్తున్నారన్నారు. గ్రామస్థులకు అన్యాయం జరిగితే రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజసంఘాల నాయకులు రామకృష్ణ, ఓబులేసు, లింగస్వామి, ఉస్మాన్‌బాషా, గ్రామస్థులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు సహకార సొసైటీలో దీర్ఘకాలిక రుణాలను తక్కువ వడ్డీకి పొంది కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని సహకార సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సహకార సొసైటీ వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో చంద్రశేఖర్‌గౌడు, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూరురూరల్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారి బేతం హర్ష అన్నారు. మంగళవారం మండలంలోని నాగలూటి గూడెంలో బైర్లూటి పీహెచ్‌సీ సంచార వైద్యశాల వైద్య బృందం ఆధ్వర్యంలో గిరిజన గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దీపిక, ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, బేబిజ్యోతి పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

ఆత్మకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేవీకే స్టేడియంలో ఇటీవల జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను మంగళవారం ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పేల్ మున్నా అభినందించారు. ఆయన మాట్లాడుతూ కేవీకే స్టేడియంలో శిక్షణ పొంది రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో థైక్వాండో విభాగం గౌరవాధ్యక్షులు సయ్యద్, అసదుల్లా తదితరులు ఉన్నారు.

'పని గంటలు పెంచడం అన్యాయం'

ఆత్మకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్మికులు, ఉద్యోగల చట్టబద్ధ హక్కు 8గంటల పనివిధానాన్ని 13గంటలుగా మారుస్తూ అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. పనిగంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించకపోతే కార్మికులు, ఉద్యోగులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

అడ్మిషన్ల గడువు పొడిగింపు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2025-26విద్యాసంవత్సరానికి గాను ఓపెన్‌స్కూల్ పదోతరగతి, ఇంటర్మీయడిట్‌లో అడ్మిషన్లు పొందడానికి రూ.200అపరాధ రుసుంతో వచ్చేనెల 31వరకు గడువు పొడిగించినట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. 14సంవత్సరాలు నిండినవారు పదోతరగతిలో, 15సంవత్సరాలు నిండి పదోతరగతి పాసైనవారు ఇంటర్‌లో అడ్మిషన్ పొంది ఒకే సంవత్సరంలో పూర్తి చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు అనంతరం రెండు సెట్ల జిరాక్స్ కాపీలను ఎంచుకున్న స్టడీ సెంటర్‌లో అందజేయాలన్నారు.

ఆలయ ఉద్యోగుల మానవత్వం


వృద్ధురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న ఆలయ సిబ్బంది

మహానంది, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆలయ ఉద్యోగులు మానవత్వం చాటుకున్నారు. మహానంది పుణ్య క్షేత్రంలోని స్తుపది మంటప సమీపంలో అనాథ మహిళ కొద్దిరోజులుగా గాయాలతో బాధపడేది. మంగళవారం ఆలయ పర్యవేక్షకుడు పసుపుల సుబ్బా రెడ్డి గమనించారు. మానవత్వంతో విషయాన్ని దేవస్థానం ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది చల్లగాలి లక్ష్మయ్య, ఈశ్వర్, మనోజ్ తెలియజేసి 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.


బండి ఆత్మకూరు: ఓంకారంలో బాలత్రిపురదేవిగా..


పాములపాడు : గాయత్రి దేవిగా..


పాణ్యం ఏఆర్ కాలనీలో గాయత్రిదేవిగా..


నంద్యాల సంజీవనగర్ రామాలయంలో బ్రహ్మచారిణీదేవిగా..


కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయంలో మాంగల్య గౌరీదేవిగా..


బ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానంలో మధురమీనాక్షీదేవిగా..



బాలాజీ కాంప్లెక్స్ కల్యాణమండపంలో అన్నపూర్ణాదేవిగా..


ప్రత్యేక అలంకారంలో వాసవీమాత

వివిధ రూపాల్లో అమ్మవారు

- అమ్మవార్లును దర్శించుకున్న భక్తులు

నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల పరిధిలోని శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆలయాలు, మండపాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


జూపాడుబంగాలో బ్రహ్మచారిణీ అలంకరణలో..


ఆత్మకూరు మండలం వెంకటాపురంలో గాయత్రిమాతగా..


ఆత్మకూరు కిషన్‌సింగ్ వీధిలో దుర్గాదేవిగా..


గడివేముల అమ్మవారిశాలలో బాల త్రిపురసుందరిగా..



నందికొట్కూరు పట్టణంలోని సుంకులాపరమేశ్వరి, చౌడేశ్వరి ఆలయాల్లో గాయత్రీదేవిగా..

పారిశుధ్య కార్యక్రమాలు
ముమ్మరం చేపట్టాలి

- కలెక్టర్ రాజకుమారి



నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేపట్టి ప్రతి గ్రామాన్ని చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆమె మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో తాగునీరు, పారిశుధ్యంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామాల్లో పరిసరాలు చెత్తకుప్పలు, పేడ దిబ్బలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులు, పంచాయతీ సిబ్బంది, పబ్లిక్‌హెల్త్ అధికారులు సమన్వయంతో ప్రజలకు మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ట్యాంకులు ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసి శుభ్రపరచాలన్నారు. ఈవోఆర్డీలు, పంచాయతీ సిబ్బంది క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిశుభ్రత వల్ల అంటువ్యాధులు నివారించవచ్చన్నారు. జిల్లాకు మంజూరైన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలకు సూచించారు. ముఖ్యంగా హాస్టళ్లలో ఈ నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పని చేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నంద్యాల విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో టెక్కలోని భగీరథ సదన్‌లో మంగళవారం ఆయుర్వేద శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ రామకృష్ణారెడ్డి, పబ్బతి వేణుగోపాల్, వీహెచ్‌పీ సేవా విభాగ్ ప్రముఖ్ డాక్టర్ పోలూరు రామ్మూర్తి పాల్గొని జ్యోతిప్రజల్వన చేసి ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్లు యశోధర, చిట్టిబొట్ల మదుసూదనశర్మ, భరద్వాజశర్మ, అలిబాష, ఐవి సుబ్రహ్మణ్యం, శ్రీలక్ష్మీ, వెంకటక్రిష్ణ, ఈశ్వర్, చందన, శ్రావణసంధ్య, సురేష్ బాబులు తదితరులు పాల్గొని ఆయుర్వేద వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి నాయకులు చంద్రమౌళీశ్వరరెడ్డి, వైయస్‌రెడ్డి, సందీప్, విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసూదనరావు, గోళ్ల సుదర్శనం, సుహాసిని, శ్రీకాంత్, శేషసాయి, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్



మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్

ఆత్మకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వ్యసనం - పర్యవసానాలు, సైబర్ క్రైం అనే అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు, గంజాయి తదితర మత్తు పదార్థాల వల్ల తీవ్ర దుష్పలితాలు ఉంటాయన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగించేవారిలో యువత ఎక్కువగా ఉన్నారని, దీనివల్ల యువత భవిష్యత్ అంధకారం కానుందని వివరించారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు జీవితాలను నాశనం చేస్తుందన్న విషయాన్ని యువత గుర్తించుకోవాలని సూచించారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాల విక్రయాలు జరిగితే డయల్ 100 లేదా మాదక ద్రవ్యాల కంప్లైంట్ ప్రత్యేక నంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అపరిచిత ఫోన్‌కాల్స్, మేసేజ్‌లు, లింక్‌ల జోలికి వెళ్లవద్దని తెలిపారు. ప్రత్యేకించి సోషల్ మీడియాను అవసరానికి మాత్రమే వినియోగించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు పర్యవేక్షకులు శ్యాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న, అధ్యాపకులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రయోజనాలను వివరించాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బేబి

నందికొట్కూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు తీసుకు వచ్చిన ఎల్ఆర్ఎస్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని మున్సిపల్ కమీషనర్ బేబి సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ వద్ద టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ బేబి, టీపీవో రంగస్వామి మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా వెలసిన వెంచర్లలో స్థలాలు తీసుకున్న లబ్ధిదారులు, అక్రమ వెంచర్ వ్యాపారులు తమ స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు ఒక చక్కటి అవకాశాన్ని ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఈ విధానం ద్వారా ఎలాంటి అనుమతులు లేని స్థలాలను ఈ ఎల్ఆర్ఎస్ విధానం ద్వారా సక్రమం చేసుకోవచ్చన్నారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలకు వివరిస్తూ ఎల్ఆర్ఎస్ విధానాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం పట్టణంలో పలు సెంటర్‌లలో టౌన్ ప్లానింగ్ అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు ఎల్ఆర్ఎస్ విధానంపై అవగాహన కల్పించారు.

నంద్యాల రూరల్ తహసీల్దార్‌గా శ్రీవాణి



నంద్యాల రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : నంద్యాల రూరల్ తహసీల్దార్‌గా శ్రీవాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పట్టణంలోని ఎస్సార్బీసీలో డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహించి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది అభినందించారు. విధులపై నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి తహసీల్దారు సూచించారు.

నీటి మునక నుంచి కాపాడాలి

బండిఆత్మకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురంలో వరి పంట పొలాలు మునకకు గురి కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కాపాడాలని సీఐటీయూ నాయకులు రత్నమయ్య, డేవిడ్ డిమాండ్ చేశారు. మంగళవారం రామాపురంలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ కేసీ కెనాల్, మద్దిలేరు వాగులకు అండర్ టర్నల్ లేకపోవటంతో వరద ఉధృతి సమయంలో సమీప పంట పొలాలు నీటి మునకకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ రైతు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


సురేంద్రనాథరెడ్డి

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని టీడీపీ మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథరెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ మండల కన్వీనర్‌గా నియమితులైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చిన టీడీపీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీ మాండ్ర శివానందరెడ్డికి, ఎమ్మెల్యే జయసూర్యలకు తన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యకర్తలకు అండగా ఉంటానని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కష్టపడితే ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు


ర్యాలీలో పాల్గొన్న అభిరుచి మధు

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పుట్టుకతో ఎవరు గొప్పవారు కాలేరని, కష్టపడితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా పక్షోత్సవాలలో భాగంగా మంగళవారం బొమ్మలసత్రంలోని ఎస్వీరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ఒక సాధారణ కుటుంబంలో పుట్టి చిన్నతనంలో టీ అమ్ముతూ జీవన పోరాటం ప్రారంభించి నేడు ప్రధాని స్థాయికి ఎదగడం ప్రతి విద్యార్థికి ప్రేరణ కావాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రధానిని ఆదర్శంగా తీసుకొని జీవితంలోని ప్రతి రంగంలో కష్ట పడుతూ ముందుకు సాగితే గొప్ప స్థానాలు దక్కించుకోవచ్చునన్నారు. ఇందులో భాగంగా మోదీ బాల్యం, కష్టాలు, సాధించిన విజయాలు అనే డాక్యుమెంటరీ ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నిమ్మకాయల సుధాకర్, ఉపేంద్రనాథరెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుయువత మండల అధ్యక్షుడిగా కరీంబాషా


కరీంబాషాను అభినందిస్తున్న మాండ్ర శివానందరెడ్డి

పాములపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగుయువత మండల అధ్యక్షుడిగా కరీంబాషాను నియమించినట్లు టీడీపీ మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నందికొట్కూర్ నియోజకవర్గం శాసనసభ్యులు గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూర్ టీడీపీ ఇన్‌చార్జీ గౌరు వెంకటరెడ్డి, ఆదేశాల మేరకు మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన కరీంబాషాను తెలుగుయువత మండల అధ్యక్షుడిగా నియమించామన్నారు.

సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యం

- కార్యాలయంలో జవాబుదారీతనం కరువు


సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఆత్మకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలోని 5వ సచివాలయంలో సిబ్బంది పనితీరు ఇష్టారాజ్యంగా ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఓ వ్యక్తి తన కుమారుడికి వ్యాక్సిన్ వేయించేందుకు సచివాలయానికి వెళ్లి అక్కడున్న ఓ ఉద్యోగిని ఏఎన్ఎం ఎప్పుడు అందుబాటులో ఉంటారని సమాచారాన్ని కోరగా ఇందుకు సదరు ఉద్యోగి ఎలాంటి జవాబుదారితనం లేకుండా తమకు తెలియదని దురుసుగా సమాధానం ఇచ్చినట్లు సమాచారం. అదేవిధంగా మధ్యాహ్నం మరోసారి సచివాలయానికి వెళ్తే అక్కడ ఎవరూ అందుబాటులో లేకపోవడంతో పాటు ఖాళీ కుర్చీలను చూసి ఆ వ్యక్తి అవాక్కయ్యాడు. విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేస్తే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు ప్రభుత్వ ఆశయానికి తూట్లు పడేలా చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా.. మున్సిపాలిటీ అధికారులు సచివాలయల పట్ల పర్యవేక్షణ మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆశిద్దాం. ఈ విషయంపై మున్సిపల్ మేనేజర్ రవికుమార్‌ను వివరణ కోరగా బాధితుడు తనకు ఫిర్యాదు చేయడంతో వెంటనే సచివాలయాన్ని సందర్శించి అక్కడ సిబ్బందిని విచారించామన్నారు. ప్రజలకు ఇబ్బందులకు గురి చేయకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించినట్లు తెలిపారు.

స్త్రీ ఆరోగ్యమే.. సమాజ ఆరోగ్యం

పాములపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని ఎంపీపీ సరోజినీ వర్ణీనియా అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో సర్పంచ్ భాగ్యమ్మ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ కాంతరావు నాయక్, డాక్టర్లు జగదీష్ చంద్రారెడ్డి, నాగలక్ష్మి, మహ్మద్ బేగ్, రజని, సావిత్రి అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్షరాంధ్రలో భాగస్వాములు కావాలి

పాములపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఏడీ వెంకటేశ్వర్లు అన్నారు. మగళవారం పాములపాడులోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి మహిళ చదువు నేర్చుకోవాలన్నారు. ఒక్కో వలంటీర్ కనీసం పదిమంది నిరక్షరాస్యులకు చదు వు నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు భాస్కర్‌రెడ్డి శ్రీని వాసులు, సీసీలు, వీవోఏలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

పాణ్యం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం ఫార్మసీ కళాశాల విద్యార్థిని బి. సౌమ్య సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్ మంగళవారం తెలిపారు. ఈనెల 18న అనంతపురం అనంతలక్ష్మీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూఏ సౌత్ జోన్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు వివరించారు. తమిళనాడు సేలంలోని వినాయక మిషన్స్, రీసర్చ్ ఫౌండేషన్ డీమ్డ్ యూనివర్సిటీలో నిర్వహించనున్న సౌత్ జోన్ పోటీల్లో సౌమ్య పాల్గొంటారన్నారు. కళాశాల ఎండీ శివరాం, పీడీ మునిశంకర్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యార్థినిని అభినందించారు.

ఆర్డీటీ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఆర్డీటీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని సీపీఎం నాయకులు రణధీర్, నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా ఆర్డీటీ కాలనీలో పర్యటించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2011-13లో నిర్మించిన ఆర్డీటీ కాలనీలో సరైన సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రోగాల బారిన పడాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చిన్నప్పటి నుంచే అవగాహన ఉండాలి

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థికి చిన్నప్పటిని నుంచే కాగితపు, మట్టి బొమ్మల తయారీపై అవగాహన ఉండాలని సీడీపీవో చంద్రకళ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు అంగన్‌వాడీ కార్యకర్తలు కాగితాలు, మట్టితో బొమ్మలు తయారు చేయడం వాటికి రంగులు వేయడం వంటివి నేర్పించారు. అనంతరం విద్యార్థుల తల్లులకు పోషకాహార పదార్థాలు వంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా మలుపులు

- ఎన్‌హెచ్-544డీ రహదారిలో తరచూ ప్రమాదాలు
- రోడ్డు పక్కన రాళ్ల కుప్పలు, కంపచెట్లతో ఇబ్బందులు
- ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని వైనం


అంకిరెడ్డిపల్లె మలుపు వద్ద ఉన్న నాపరాళ్ల గుట్ట

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపూరం - అమరావతి(ఎన్‌హెచ్-544డి) జాతీయ రహదారిలో నెలకొన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. జాతీయ రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు ఈ రహదారిలో ప్రయాణాలు సాగిస్తూ ఉంటాయి. అయితే కొలిమిగుండ్ల మండలంలోని బెలుం గుహల వద్ద నుంచి తాడిపత్రికి వెళ్లే మార్గంలో పలు చోట్ల ఈ మలుపులు ప్రమాదకరంగా మారాయి. వాహనా రద్దీ అధి కంగా ఉండటం, మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటు న్నాయి. కొలిమి గుండ్ల సమీపంలోని జగనన్న కాలనీ, ఇటిక్యాల, కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె వద్ద ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. రోడ్డు పక్కనే నాపరాళ్ల పరిశ్రమకు సంబంధించిన రాళ్ల కుప్పలు, కంప చెట్లు ఎత్తుగా ఉండటంతో మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఏడాది క్రితం ఇదే మలుపుల వద్ద జరిగిన రెండు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. గత ఆగస్టు నెలలోనే మూడు ప్రమాదాలు చోటు చేసుకోగా ఆరుగురికి గాయాలయ్యాయి. ఇటీవల జగనన్న కాలనీ సమీపంలోని మలుపు వద్ద అడ్డుగా ఉన్న నాపరాళ్ల వేస్టేజీని సీఐ రమేష్‌బాబు కొంతమేర తొలగించారు. అయితే ఇంకా చాలా చోట్ల నాపరాళ్ల వేస్టేజీ రోడ్డు పక్కన అలాగే ఉంది. కంప చెట్లు సైతం రహదారిలో ఎదురుగా వస్తున్న వాహనాలను కనిపించకుండా చేశాయి. ఇప్పటికైనా సంబ ంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద రహదారిని విస్తరించి, ప్రమాదాలు అరికట్టాలని కోరుతున్నారు.


కొలిమిగుండ్ల జగనన్న కాలనీ వద్ద ఉన్న మలుపు, ఇటిక్యాల వద్ద..

ఉద్యాన పంటల పరిశీలన


ఉద్యాన పంటను పరిశీలిస్తున్న కలెక్టర్

బేతంచెర్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంబాయి, సీతారామపురం గ్రామాల్లోని ఉద్యాన పంటలను కలెక్టర్ జి.రాజకుమారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉల్లి రైతులతో ముఖా ముఖి నిర్వహించారు. పంటల దిగుబడి లాభ, నష్టాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అధిక దిగుబడిని ఇచ్చే హైబ్రీడ్ విత్తనాలను వేయాలని రైతులకు సూచించారు. డ్రిప్ ఇరిగేషన్‌తో మంచి నాణ్యమైన పంటలను పండించవచ్చని, కలుపు నివారణకు మల్చింగ్ విధానంలో పంటలను సాగు చేయవచ్చని సూచించారు. ఎంబాయి గ్రామంలో సాగు చేస్తున్న అరటి, మామిడి తోటలను పరిశీలించారు. సీతారామపురం గ్రామంలో రైతు పాలెం యుగంధర్‌రెడ్డి వేసిన షేడ్ నట్ నర్సరీని సందర్శించారు. ఈ నర్సరీ ద్వారా అరటి, మిరప, చామంతి మొక్కలను రైతులకు అందించి ఆదా యం పొందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఉద్యాన శాఖాధికారులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేయాలి: ఎంపీడీవో


మాట్లాడుతున్న ఎంపీడీవో వరప్రసాదరావు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విధుల్లో సచివాలయ సిబ్బంది అంకితభావంతో పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కోవెలకుంట్ల ఎంపీడీవో వరప్రసాదరావు అన్నారు. మంగళవారం అగ్రికల్చర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, మత్స్యశాఖ, వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కోవెలకుంట్ల పట్టణంలోని రైతు సేవా కేంద్రం-5లో పీ4 పథకంపై సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పీ4 పథకంపై శిక్షణ పొందిన శిక్షకులు బాల ఈశ్వరయ్య, విష్ణువర్ధన్, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, సొహైల్ సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. బుధవారం మహిళా పోలీసు, పంచాయతీ కార్యద ర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, సర్వే అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై దృష్టి సారించండి: ఎంపీడీవో

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళిగౌడ్ అన్నారు. మంగళవారం వారు కొలిమి గుండ్లలోని శాంతినగర్, పెద్దమ్మ వీధి, దర్గా కాలనీ, చెన్నకేశవస్వామి వీధి తదితర ప్రాంతాలను పరిశీలించారు. వీధుల్లో కాలువలు, చెత్త, పరిసరాల శుభ్రత చేపట్టాలని గ్రామసర్పంచ్ శివరాముడు, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కి సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు శ్రేయస్కరం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేసుకోవడం తల్లులకు శ్రేయస్కరమని కొలిమి గుండ్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు హరిచరణ్‌రెడ్డి అన్నారు. మంగళ వారం ఆయన మాట్లాడుతూ కొలిమిగుండ్ల ఆసుపత్రిలో ప్రతి నెలా సుమారు 5 కాన్పుల వరకూ చేస్తున్నామని, ఉన్నతాధికారుల ఆదే శాల మేరకు ఈసంఖ్యను మరింత పెంచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో కాన్పు చేసుకున్న వారికి ప్రభుత్వం రూ.4 వేలు అందిస్తోందని అన్నారు.

పెండింగ్ డీఏ ఇవ్వాలి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డీఏను ఇవ్వాలని ఉపా ధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్, అధికార ప్రతినిధి ముత్తోజి వీరబ్రహ్మం కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పీఆర్సీ, డీఏలు ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఇంతవరకు డీఏ ఇవ్వలేదని, సరెండరు లీవులు, గ్రాడ్యుటీ చెల్లించడంలేదన్నారు.

పాడిపరిశ్రమతో గ్రామాల అభివృద్ధి


మందులను పంపిణీ చేస్తున్న డాక్టర్ రాజశేఖర్

దొర్నిపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉపసంచాలకుడు డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని చాకరాజువేముల గ్రామంలో పశువైద్యాధికారి చిన్న బాబు ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్‌మిషన్ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడిపరిశ్రమను అభివృద్ధి పరిచేందుకు అనేక పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్రమంలో డీసీ వైస్ ప్రెసిడెంట్ లింగుట్ల వెంకట్‌నా యుడు, గంగవరం కృష్ణారెడ్డి, ఆళ్లగడ్డ పశుసంవర్ధకశాఖ డీడీ రమణయ్య, ఆళ్లగడ్డ ఏడీ నాగరాజు, పశువైద్యాధికారి చిన్నబాబు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

సంతాపం ప్రకటించిన టీడీపీ నాయకులు


దేశంరెడ్డి(ఫైల్)

చాగలమర్రి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగ నూరు గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు రెడ్డెం దేశంరెడ్డి (75) అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం ఆయన మృతికి టీడీపీ నాయకులు సంతాపం ప్రకటించి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, టీడీపీ నాయకులు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, భార్గవ్‌రామ్‌నాయుడులు సెల్‌ఫోన్‌లో సంతాపం ప్రకటించారు.

దసరా ఉత్సవాలకు మాజీ ఎంపీ టీజీకి ఆహ్వానం


టీజీ వెంకటేష్‌తో ఆర్యవైశ్య నాయకులు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరగుతున్న దసరా ఉత్సవాలకు హాజ రు కావాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్‌కు ఆళ్లగడ్డ ఆర్యవైశ్య నాయ కులు ఆయన్ను తన స్వగృహంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజే శారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు ఆయనకు బొకే ఇచ్చి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకుడు బైసాని రవి పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలతో ఆత్మవిశ్వాసం

శిరివెళ్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని నంద్యాల డిప్యూటీ డీఈవో డీటీ శంకర్ ప్రసాద్, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగ సువర్చల అన్నారు. శిరివెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వృత్తి విద్యలో భాగంగా మంగళ వారం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. ఆ కేంద్రాన్ని నంద్యాల డిప్యూటీ డీఈవో డీటీ శంకర్ ప్రసాద్, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగ సువర్చల పరిశీలించి సలహాలు, సూచనలిచ్చారు. వొకేషనల్ ట్రైనర్ ఖాజా మొయినుద్దీన్ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ మృతికి నివాళి

డోన్ టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ అనారోగ్యంతో మృతి చెందాడు. రంగడు మృతికి డోన్ మోటారు వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎవీ భాస్కర్‌రెడ్డి, టీ.శివరాం సంతాపం తెలిపారు. ధర్మవరం గ్రామం లోని ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులన పరామర్శించారు. కార్యక్రమంలో రామచంద్రుడు, మహేష్, లారీ డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

కూలిన మట్టిమిద్దెల పరిశీలన

చాగలమర్రి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లె ముత్యాలపాడు, గొడిగనూరు గ్రామాల్లో భారీ వర్షాలకు కూలిన మట్టిమిద్దెలను ఆళ్లగడ్డ డివిజన్ హౌసింగ్ డీఈ విజయ్‌బాబు, ఏఈ నవీన్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. కొత్తగా గృహాలు మం జూరు చేసేందుకు వాటిని పరిశీలించామని డీఈ విజయ్‌బాబు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

బేతంచెర్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన శిరీష(21) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ అబ్దుల్ నబీ మంగళవారం తెలిపారు. ఈ నెల 19న శిరీష నాయనమ్మ మృతి చెందడంతో మనస్తాపానికి గురై ఆమె ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నా నికి పాల్పడినట్లు ఏఎస్ఐ తెలిపారు. అపస్మారకస్థితిలో ఉన్న శిరీషను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతురాలి తల్లి సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

డోన్ టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తారక రామనగర్‌కు చెందిన అశోక్ కుమారుడు 9 ఏళ్ల బాలుడు జితేందర్ సోమవారం ఇంటి నుంచి స్నేహితులతోపాటు వెళ్లి అడ్రస్‌లు మరిచి పోయి తిరుగుతుండగా.. ఓ వ్యక్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. స్పందించి సీఐ ఇంతియాజ్ బాషా బాలుడి ఆచూకీని తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించాలని పోలీసులకు ఆదేశించారు. దీంతో పోలీసులు బాలుని ఆచూకీని తెలుసుకుని మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గొడిగనూరు గ్రామంలోని బీసీ కాలనీలో జ్వర బాధితులను గుర్తించి వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు తస్లీమ్ సుల్తాన ఆధ్వర్యంలో పీ-4 సర్వే నిర్వహించి రక్తపూత పరీక్షలు చేశారు.

కొనసాగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు

బనగానపల్లె, డోన్, ఆళగడ్డ నియోజకవర్గాల పరిధిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రెండో రోజు మంగళవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


బనగానపల్లెలో మంగళగౌరి అలంకరణలో అమ్మవారు


బెలుంలో గాయత్రీ దేవిగా..


ఆళ్లగడ్డలో అన్నపూర్ణదేవిగా..


డోన్‌లో కైలాస గౌరిగా..


కొవెలకుంట్లలో కాత్యాయని దేవిగా..


ఉయ్యాలవాడలో గాయత్రీదేవిగా..


ప్యాపిలిలో బాలత్రిపుర సుందరీదేవిగా..


ముత్యాలపాడులో శారదదేవిగా..


శిరివెళ్ల, రుద్రవరంలో గాయత్రీదేవిగా..


దొర్నిపాడులో అన్నపూర్ణదేవిగా..


సంజామలలో కాత్యాయని దేవిగా..






చాగలమర్రి, డోన్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు, ఆళ్లగడ్డలో పూజ సామగ్రిని అందజేస్తున్న కమిటీ సభ్యులు

ప్రజా సమస్యలను పరిష్కరించాలి: జేసీ


దరఖాస్తులను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యా లయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ దరఖాస్తులను ఇచ్చిన గడువులోపు పరిష్కరించాలన్నారు. మండలంలో 27 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ ప్రసాద్ బాబుకు సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ విజయ లక్ష్మి, ఆర్ఐ అంకన్న, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శిగా వెంకటేశ్వరమ్మ

డోన్ టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్బీవోస్ కాలనీలోని నేషనల్ పీజీ కళాశాలలో సోమవారం జరిగిన ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా రెండో మహాసభలో ప్రతినిధులు జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అందులో జిల్లా సహాయ కార్యదర్శిగా డోన్ నుంచి బి.వెంకటేశ్వరమ్మ ఎన్నికయ్యారు. ఈమె ఎన్నికపై సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం, సీనియర్ నాయకులు జి.కొండయ్య, పి.రామాంజనేయులు, సీఐటీయూ పట్టణ అధ్యక్షులు నక్కి శ్రీకాంత్, మండల కన్వీనర్ ఎవి. భాస్కర్ రెడ్డి, కోకన్వీనర్ బి.నాగమద్దయ్య, ప్యాపిలి మండల కార్యదర్శి ఎస్ఏ చిన్న రెహిమాన్ హర్షం వ్యక్తం చేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అహోబిలం గ్రామంలోని పీహెచ్‌సీలో మంగళవారం గర్భిణులు, బాలికలకు వైద్యాధికారి చేతన నితీష్ వైద్యపరీక్షలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్వస్త్ నారి కార్యక్రమంలో భాగంగా బాలికలకు, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులు అంజేశారు.

పేదరిక నిర్మూలన కోసమే పీ4 : హౌసింగ్ డీఈ

చాగలమర్రి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికం లేకుండా చేసేందుకే పీ-4 సర్వే లక్ష్యంగా ఉందని హౌసింగ్ డీఈ విజయ్‌బాబు, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, కార్యదర్శులు, ఏఎన్ఎంలకు పీ-4పై నియోజకవర్గ విజన్ ప్లానింగ్ ఇన్‌చార్జి మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. వారు మాట్లాడుతూ పేదరికం దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోందని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ వో దస్తగిరిరెడ్డి, పీ-4 సర్వే శిక్షకులు ప్రదీప్ కుమార్‌రెడ్డి, సుజాత, ప్రసన్న, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు ఓబులేసు, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

దొర్నిపాడు: పేదల బతుకుల్లో వెలుగు నింపేందుకే రాష్ట్ర ప్రభుత్వం పీ-4 కార్యక్రమం చేపట్టిందని ఈవోపీఆర్డీ శివప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు పీ-4 కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 738 బంగారు కుటుంబాలను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో రామిరెడ్డి, సచివాలయ కో-ఆర్డినేటర్ శేఖర్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని పీ4 కుటుంబాలకు, మార్గదర్శులకు అనుసంధాన కర్తలు సచివాలయ ఉద్యోగులేనని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామ సచివా లయాల ఉద్యోగులకు శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1,016 పీ4 కుటుం బాలు ఉన్నాయన్నారు. వీటిని 118 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నార న్నారు. కార్యక్రమంలో జోనల్ ట్రైనర్స్ విజయ్‌భాస్కర్, పవన్ పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని పీ4 సర్వేను ప్రభుత్వ నిబంధనల మేరకు చేయాలని శిక్షకుడు శివక్రిష్ణ అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ భవనంలో పీ4 సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బంగారు కుటుంబాలు మార్గదర్శకతపై అవగాహనతోపాటు శిక్షణ కల్పించారు. కార్య క్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


రుద్రవరంలో మాట్లాడుతున్న శిక్షకుడు శివకృష్ణ


చాగలమర్రిలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ విజయ్‌బాబు


ఉయ్యాలవాడలో మాట్లాడుతున్న ఎంపీడీవో